7

సాక్షి విశాఖపట్నం

ఆదివారం : 1 : సెప్టెంబర్ : 2024



రాత్రి పూట నిఘా పటిష్టం

నేరాలు తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘాను మరింత పటిష్టం చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. 8లో



ఇంటింటికీ కాదు.. ఒకే చోట!

ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించే రోజులు పోయాయి. ప్రభుత్వం మారగానే పింఛన్ల పంపిణీ ప్రక్రియలో కూడా మార్పు వచ్చింది. 8లో



నేటి నుంచి హెల్మెట్ తప్పనిసరి

హెల్మెట్ ధరించకుండా బైక్‌లు నడిపే వారి జేబులు చిల్లులుపడనున్నాయి. నేటి నుంచి నిబంధనలను కఠినతరం చేశారు. 8లో

న్యూస్‌రీల్

10న జీవీఎంసీ సర్వసభ్య సమావేశం



సాక్షి, విశాఖపట్నం: ఆర్నెళ్ల విరామం తర్వాత మహావిశాఖ నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 10న నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. అభివృద్ధి పనులు, పాలనాపరమైన నిర్ణయాలతో కలిపి మొత్తం 28 అంశాలతో అజెండా రూపొందించామన్నారు. తర్వాత వచ్చే పనులకు సంబంధించిన అంశాలతో టేబుల్ అజెండా పొందుపరుస్తామని మేయర్ వివరించారు. ఇప్పటికే అన్ని పార్టీల కార్పొరేటర్లకు సమాచారం అందించినట్టు తెలిపారు.

క్షతగాత్రులకు చెక్కుల అందజేత



మెడికవర్‌లో చికిత్స పొందుతున్న వారికి చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

ఎంవీపీకాలనీ: ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు వైఎస్సార్‌సీపీ తరఫున రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. శనివారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. ఏడుగురు క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు క్షతగాత్రులకు వైఎస్సార్‌సీపీ తరఫున ఆర్థిక సహాయం అందజేసినట్లు అమర్‌నాథ్ తెలిపారు.

21 మంది సీఐల బదిలీ

విశాఖ సిటీ: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 21 మంది సీఐలను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 10 మందిని విశాఖ రేంజ్‌కు సరెండర్ చేశారు. అలాగే రేంజ్ నుంచి వచ్చిన నలుగురికి విశాఖలో పోస్టింగ్‌లు కల్పించారు. పెందుర్తి లా అండ్ ఆర్డర్ సీఐ ఎల్.రామకృష్ణ, పీఎంపాలెం లా అండ్ ఆర్డర్ సీఐ వై.రామకృష్ణ, సీసీఎస్-3 సీఐ పి.శోభన్‌బాబు, భీమిలి లా అండ్ ఆర్డర్ సీఐ డి.రమేష్, సీసీఎస్-2 సీఐ ఎన్.వేణుగోపాలరావు, స్టీల్‌ప్లాంట్ లా అండ్ ఆర్డర్ సీఐ వి.శ్రీనివాసరావు, పీసీఆర్ సీఐ వి.గోపీనాథ్, ఆరిలోవ లా అండ్ ఆర్డర్ సీఐ జి.గోవిందరావు, ద్వారకా లా అండ్ ఆర్డర్ సీఐ ఎస్.రమేష్, సౌత్ ట్రాఫిక్ సర్కిల్ సీఐ వి.నాగరాజులను విశాఖ రేంజ్‌కు సరెండర్ చేశారు. విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న గేదెల బాలకృష్ణను పీఎంపాలెం లా అండ్ ఆర్డర్‌కు, ఆర్.మల్లికార్జునరావును టాస్క్‌ఫోర్స్ జోన్-1లో, కె.రామారావును సీసీఎస్-2లో, ఎండీ హుస్సేన్‌కు పీసీఆర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అలాగే ఏసీబీ సీఐగా ఉన్న కె.వెంకటసతీష్‌కుమార్‌ను పెందుర్తి లా అండ్ ఆర్డర్‌కు, ఇంటెలిజెన్స్‌లో ఉన్న డి.వి.రమణను ద్వారకా లా అండ్ ఆర్డర్‌కు, జీఆర్‌పీలో ఉన్న కె.వెంకట్రావును సౌత్ ట్రాఫిక్ సర్కిల్‌కు, ఇంటెలిజెన్స్‌లో ఉన్న ఇ.కేశవరావును స్టీల్‌ప్లాంట్ లా అండ్ ఆర్డర్‌కు, ఏఎస్ఆర్ జిల్లా నుంచి వచ్చిన బి.సుధాకర్‌ను భీమిలి లా అండ్ ఆర్డర్‌కు, వి.శంకరనారాయణను సీసీఎస్-3కు, హెచ్.మల్లేశ్వరరావును ఆరిలోవ లా అండ్ ఆర్డర్‌కు పంపించారు.

92 మంది పోలీస్ సిబ్బందికి రివార్డులు



సిబ్బందికి రివార్డు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి.. పోలీస్ శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన సిబ్బందిని ప్రోత్సహించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి నెలా జరిగే నేర సమీక్ష సమావేశంలో హోంగార్డు నుంచి సీఐ స్థాయి అధికారుల వరకు ఉత్తమ విధులు అందించే వారిని గుర్తించి వారికి రివా ర్డులు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం 92 మంది సిబ్బందికి రివార్డు మంజూరు ఆర్డర్‌ను అందజేసి అభినందించారు. అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వారిని పట్టుకోవడం, చోరీ సొత్తు, ఇతర వస్తువుల రికవరీ, నిందితుల అరెస్టు, తప్పి పోయిన బాలికను 24 గంటలలో గుర్తించి తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించడం, చిన్న పిల్లలను అమ్మే అంతర్ రాష్ట్ర ముఠాలో 19 మందిని అరెస్టు చేయడం, 10 మంది పిల్లలను రక్షించడం, ఇలా అనేక కేసుల్లో ప్రతిభ చూపించిన వారిని అభినందించారు.



గాజువాకలో రూపుదిద్దుకుంటున్న 80 అడుగుల భారీ గణపతి

ఘనపతి దేవా..

SUNDAY SPECIAL

విశాఖ నగరం వినాయక చవితి ఉత్సవాల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. భారీ గణనాథులకు కేరాఫ్‌గా ఉన్న హైదరాబాద్, ముంబయి తరహాలో ఈ సారి కూడా విశాఖలో ఎత్తయిన విగ్రహాలు ఏర్పాటవుతున్నాయి. 80 అడుగులకు పైగా ఎత్తైన గణనాథుడు.. అయోధ్య రామ మందిరంలో ఏకదంతుడు.. 11 అడుగుల చాక్లెట్ వినాయకుడు.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. వదుల సంఖ్యలో విభిన్న ఆకృతుల్లో వినాయకుడి విగ్రహాలు కొలువుదీరనున్నాయి. గాజువాక, దొండపర్తి, ఎంవీపీకాలనీలో భారీ లంబోధరుడి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. – విశాఖ సిటీ

సిద్ధమవుతున్న 'మహా'గణపయ్యలు ■ వీధి.. వీధిల్లో చలువ పందిళ్లు ■ మట్టి గణపతులకే ప్రాధాన్యం

జై బోలో గణేష్ మహారాజ్‌కి జై.. అని అనేందుకు సమయం దగ్గరపడుతోంది. ఏకదంతుడి ఉత్సవాలకు కేవలం వారం రోజులు మాత్రమే ఉంది. దీంతో సాగరతీర నగరంలో వినాయక చవితి శోభ సంతరించుకుంది. కుల మతాలకు అతీతంగా.. చిన్నా, పెద్ద తేడా లేకుండా..అందరూ కలిసి సంతోషంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహణకు వందల సంఖ్యలో చలువ పందిళ్లు సిద్ధమవుతున్నాయి. విభిన్నంగా, వినూత్నంగా, ఆకర్షణీయమైన ఆకృతుల్లో మండపాలు రూపుదిద్దుకుంటున్నాయి.

తెలంగాణ నుంచి శిల్పులు..

నెలన్నర రోజుల నుంచి ప్రతిష్ఠించే ప్రాంతంలోనే విగ్రహాలను తయారు చేయిస్తున్నారు. ఇందుకోసం తెలంగాణ నుంచి శిల్పులు, పశ్చిమ బెంగాల్ నుంచి కార్మికులను విశాఖకు రప్పించారు. 45 రోజుల నుంచి విగ్రహాల తయారీలో బిజీగా ఉన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాడకుండా.. మట్టితోనే విగ్రహాలను ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి.



ఎకో ఫ్రెండ్లీ విగ్రహాల వైపే మొగ్గు

విగ్రహాల తయారీలో వాడే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగదు. మట్టిలో కలవదు. నిప్పుకు దహనం కాదు. పీవోపీతో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువులు, నీటి వనరుల్లో వేస్తే.. ఆ నీరు హానికరంగా మారిపోతుంది. ఆ నీరు తాగితే డయేరియా, చర్మ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. జల చరాలు, పశువులకూ ఆ నీటితో ముప్పే. అందుకే రసాయనాలతో చేసిన విగ్రహాలను తగ్గించాలంటూ ఏటా పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణంపై ప్రతి ఒక్కరిలోనూ చైతన్యం పెరిగింది. దీంతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. మట్టి వినాయకుల వైపే మొగ్గు చూపిస్తున్నారు.

భారీ గణనాథులకు కేరాఫ్‌గా విశాఖ

భారీ గణనాథులు అంటే.. అందరికీ ముందుగా గుర్తొచ్చేది హైదరాబాద్, ముంబయి. 50 నుంచి వంద అడుగుల ఎత్తులో విగ్రహాల ఏర్పాటుకు పెట్టింది పేరు. ఇప్పుడు విశాఖ కూడా ఆ జాబితాలో చేరిపోయింది. ఈ ఏడాది కూడా 80 అడుగులకు పైగా ఎత్తైన విగ్రహాల ఏర్పాటులో ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిమగ్నమయ్యారు. మరో వైపు విభిన్న, ఆకర్షణీయమైన సెట్లతో అందరినీ ఆకట్టుకునేలా మండపాలను తీర్చిదిద్దుతున్నారు. ప్రధానంగా అయోధ్య రామ మందిరం సెట్ సిద్ధం చేసి అందులో వినాయకులను ప్రతిష్ఠిస్తున్నారు.

కోల్‌కతా నుంచి మట్టి..

ఈ విగ్రహాల తయారీకి పవిత్రమైన, నదుల ఒడ్డున లభించే మట్టిని వినియోగిస్తున్నారు. ఇందుకోసం నిర్వాహకులు కోల్‌కతా నుంచి గంగా నది మట్టిని, ఏటికొప్పాక నుంచి ఎర్రమట్టిని తీసుకువచ్చారు. ఈ మట్టితో పాటు గడ్డి, వెదురు బొంగులతో భారీ గణనాథులను తీర్చిదిద్దుతున్నారు. ఈ కార్యక్రమం ముగిసేంత వరకు శిల్పులు, నిర్వాహకులు ప్రత్యేక నిష్ఠ, నియమాలను పాటిస్తున్నారు. చిన్న, మధ్య సైజులో ఉన్న విగ్రహాలను నగరంలో సముద్రంలో నిమజ్జనం చేస్తారు. కానీ భారీ విగ్రహాలను మాత్రం ప్రతిష్ఠించిన ప్రదేశంలోనే నిమజ్జనం చేయాలి. ఇందుకోసం కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తీసుకురానున్నారు.

నియమ నిష్ఠలతో విగ్రహం తయారీ



నాలుగు దశాబ్దాలుగా భారీ విగ్రహాలు తయారు చేస్తున్నాం. వినాయక చవితికి రెండు నెలల ముందే విగ్రహ తయారీ ప్రాంతాన్ని పరిశీలిస్తాం. విగ్రహ ఆకృతి, ఎత్తును బట్టి తయారీకి 45 నుంచి 60 రోజులు సమయం పడుతుంది. ఈ సమయంలో నియమ, నిష్ఠలతో ఉంటాం. ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా పూర్తి పర్యావరణ హితంగా.. ఆకర్షణీయంగా విగ్రహాలను తీర్చిదిద్దుతున్నాం.

– కొత్తకొండ నగేష్, శిల్పి, తెలంగాణ



విగ్రహాల తయారీలో బిజీబిజీ

ఒకవైపు భారీ విగ్రహాల ఏర్పాటుతో పాటు వందల సంఖ్యలో చిన్న, మధ్య తరహా విగ్రహాలు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. దొండపర్తి, శంకరమఠం, కంచరపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, ఆరిలోవ, అడవివరం, జాతీయ రహదారికి ఇరువైపులా విగ్రహాలను తయారు చేస్తున్నారు. పశ్చిమబెంగాల్, రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి కళాకారులు మూడు నెలల నుంచి విశాఖలోనే మకాం వేశారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసుకుని రెండు అడుగుల నుంచి 20 అడుగుల వరకు విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటిని రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయిస్తున్నారు.

భారీ గణనాథుడు.. చాక్లెట్ వినాయకుడు



2012 నుంచి గాజువాక భారీ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది కూడా 80 అడుగులకు పైగా ఎత్తైన విగ్రహాన్ని సిద్ధం చేస్తున్నాం. ప్రధాన మండపానికి పక్కన అయోధ్య తరహా రామమందిరం సెట్ వేస్తున్నాం. అందులో 11 అడుగుల చాక్లెట్ వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నాం. భారీ వినాయకుడితో పాటు చాక్లెట్ వినాయకుడు కూడా ఈ సారి ప్రధాన ఆకర్షణగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు.

– కొసిరెడ్డి గణేష్‌కుమార్, గాజువాక గణేష్ ఉత్సవ్ కమిటీ చైర్మన్

ప్రథమ పౌరురాలే గుర్తుకు రాలేదా..

- చాంబర్‌లో ఉన్న తనకు తెలియకుండా హెల్ప్‌డెస్క్ ఎలా ప్రారంభిస్తారు?
- కనీస ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం లేదా..
- బీసీ మహిళపై వివక్ష తగదు
- కమిషనర్ ఒంటెద్దు పోకడపై ధ్వజమెత్తిన మేయర్ హరివెంకటకుమారి





హెల్ప్‌డెస్క్ ప్రారంభిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం: భారత రాష్ట్రపతి, గవర్నర్, ప్రధాని ఎవరు వచ్చినా.. ప్రథమ పౌరురాలికి ప్రత్యేక ప్రొటోకాల్ ఉంటుందనీ.. అలాంటిది కార్పొరేషన్‌లో కమిషనరే ప్రొటోకాల్‌కు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి ధ్వజమెత్తారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆధునికీకరించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక హెల్ప్‌డెస్క్‌ను కమిషనర్ పి.సంపత్‌కుమార్ శనివారం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కనీస ప్రొటోకాల్ పాటించకుండా కమిషనర్ వ్యవహరించడంపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యాలయం ఛాంబర్‌లోనే తాను ఉన్నా.. సమాచారం కూడా ఇవ్వకుండా ప్రథమ పౌరురాల్ని, చట్టాన్ని అవమానించి అగౌరవ పరిచారంటూ వ్యాఖ్యానించారు. ప్రొటోకాల్ ప్రకారం తనకు తెలియకుండా హెల్ప్‌డెస్క్‌ని ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. బీసీ మహిళ అనే వివక్షతోనే తనపై ఎప్పటికప్పుడు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పాలకమండలి ఉన్నప్పుడు మేయర్‌కు ప్రథమ ప్రాధాన్యమివ్వాలన్న గౌరవం పాటించకుండా ఒంటెద్దుపోకడతో వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి రోజూ 5 కౌంటర్లలో ఫిర్యాదుల స్వీకరణ

గ్రేటర్ పరిధిలో ప్రజా సమస్యలను ప్రతి రోజూ స్వీకరించేందుకు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశామని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ప్రధాన కార్యాలయంలో ఆధునికీకరించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' హెల్ప్ డెస్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏర్పాటు చేసిన 5 కౌంటర్లలో సెలవు రోజులు మినహా ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అర్జీలు నమోదు చేసుకొని జీవీఎంసీ సమావేశ మందిరంలో ఉన్న అధికారులకు వీటిని అందించవచ్చన్నారు. కౌంటర్-1లో సామాజిక పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఇళ్లు, పట్టాల లబ్ధి, ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ ఇబ్బందులపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. కౌంటర్-2లో రోడ్లు, కాలువలు, స్ట్రీట్‌లైట్స్, నీటి సరఫరా, పార్కులు, శ్మశాన వాటికలపైన, మూడో నంబర్ కౌంటర్‌లో టౌన్ ప్లానింగ్‌పై ఫిర్యాదులు, కౌంటర్-4లో రెవెన్యూ విభాగానికి సంబంధించి, కౌంటర్-5లో పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. సమాచారం కోసం టోల్ ఫ్రీ నెం.1800 4250 0009ని కూడా సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏడీసీలు వై శ్రీనివాసరావు, రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ఎగ్జామినర్ వాసుదేవరెడ్డి, చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్, డీసీఆర్ శ్రీనివాసరావు, సీఎంహెచ్‌వో డా.నరేష్‌కుమార్, ఉద్యానవన అధికారి దామోదర్ పాల్గొన్నారు.

చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా రామకృష్ణప్రసాద్



సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కింజరాపు రామకృష్ణ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీ కేడర్‌లో ఉన్న రామకృష్ణ ప్రసాద్‌కు ప్రభుత్వం ఎస్పీగా పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన గురుద్వారా సమీపంలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

హన్నా.. ఇదా నీ లోగుట్టు

- ఎన్నికల ఫండ్ ఇవ్వలేదని సర్వీసు రోడ్డు మూసివేత
- తెరవాలంటూ స్థానికుల వినతి
- తమ చేతుల్లో లేదని చేతులెత్తేసిన పోలీసులు?
- స్థానిక నేతల జోక్యంతో తాజాగా సర్వీసు రోడ్డు పునరుద్ధరణ
- మండిపడుతున్న సదరు నేత



శ్రీనగర్ లో డీమార్టుకు ఎదురుగా సర్వీస్ రోడ్డులో అడ్డంగా వేసిన సిమెంట్ స్టాపర్లు



క్రేన్‌తో స్టాపర్లను తొలగిస్తున్న బి.వి.రామ్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఎన్నికల ఫండ్ ఇవ్వలేదన్న సాకుతో ఏకంగా సర్వీసు రోడ్డును మూసివేశాడో కూటమి నేత. రాష్ట్ర స్థాయిలో పేరున్న సదరు నేత ఎన్నికల సమయంలో తమకు ఫండ్ ఇవ్వాలంటూ కొందరిని ఆశ్రయించాడు. ఓ సంస్థ సిబ్బంది తమ చేతుల్లో నిధులు ఉండవని, తమ ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉందంటూ సమాధానమివ్వడంతో సదరు నేతకు చిర్రెత్తుకొచ్చింది. ఎన్నికల్లో గెలిచిన వెంటనే తన బలంతో గాజువాకలో రెండు ఫంక్షన్ హాల్స్‌తోపాటు డీ-మార్ట్‌కు వెళ్లే సర్వీసు రోడ్డును మూయించేశాడు. ఈ సర్వీసు రోడ్డును ఎందుకు మూసివేశారో ఎవరికీ ఇన్నిరోజులుగా అర్థం కాలేదు. సర్వీసు రోడ్డు మూసివేతతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ స్థానికులు పోలీసులతో పాటు జీవీఎంసీ అధికారులను కలిసి విన్నవించారు. అయినా ఎందుకు మూసివేశారనే విషయాన్ని ఎవరూ స్పష్టంగా చెప్పకపోవడంతో మిన్నకుండిపోయారు. తాజాగా ఈ సర్వీసు రోడ్డును కొందరు స్థానిక నేతలు తెరవడంతో సదరు ఫండ్ నేత వారి మీద అగ్గిమీద గుగ్గిలమైనట్టు తెలుస్తోంది. దీంతో ఎన్నికల ముందు ఫండ్ ఇవ్వకపోవడంతోనే సర్వీసు రోడ్డును మూసివేశారనే విషయం నగరంలో గుప్పుమంది. సర్వీసు రోడ్డును మూసివేస్తూ మొన్నటి వరకు స్టాపర్స్‌ను ఏర్పాటు చేసిన పోలీసులు కూడా ఇప్పుడు మిన్నకుండిపోతున్నారు. ఇప్పుడు తలదూరిస్తే అసలు సర్వీసు రోడ్డు మూసివేయాలంటూ ఎవరు ఆదేశాలిచ్చారనే విషయం బయటకు వస్తుందని మిన్నకుండిపోతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా ఎన్నికల ఫండ్ కోసం ఏకంగా సర్వీసు రోడ్డునే మూసివేసిన సదరు నేత వ్యవహారాలు ఒక్కొక్కటిగా తాజాగా బయటకు వస్తున్నాయి.

అదనంగా 2 కిలోమీటర్ల ప్రయాణం...!

వాస్తవానికి స్థానిక విశ్వేశ్వరరావునగర్ కాలనీ నుంచి జాతీయ రహదారిపైకి వచ్చేందుకు గతం నుంచే సర్వీసు రోడ్డు అందుబాటులో ఉంది. ఈ రోడ్డు శ్రీనగర్ జంక్షన్‌కు అనుసంధానమై ఉంటుంది. సర్వీసు రోడ్డులో విశ్వేశ్వరయ్యనగర్ కాలనీతో పాటు రెండు ఫంక్షన్ హాల్స్, డీ-మార్ట్‌కు వెళ్లేందుకు ఈ సర్వీసు రోడ్డు ఎంతో ఉపయుక్తం. అయితే, హఠాత్తుగా కొద్దిరోజుల క్రితం సర్వీసు రోడ్డును మూసివేశారు. ఫలితంగా విశ్వేశ్వరరావునగర్ కాలనీ నుంచి గాజువాకకు వెళ్లాలంటే అదనంగా 2 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వచ్చింది. ప్రధానంగా కారులో ప్రయాణించే వారితో పాటు ఫంక్షన్ హాల్స్‌కు వెళ్లేవారు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నిత్యావసర సరుకుల కోసం డీ-మార్ట్‌కు వెళ్లే వారి ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. సరుకులు తీసుకునేందుకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి 2 కి.మీ అదనంగా ప్రయాణించి చేరుకోవాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో సర్వీసు రోడ్డును తెరవాలంటూ స్థానికులు తీవ్రంగా ప్రయత్నించారు.

పెద్ద వాళ్లు ఉన్నారంటూ..!

విశ్వేశ్వరరావునగర్ కాలనీ నుంచి వచ్చే స్థానికులతో పాటు ఫంక్షన్ హాల్స్, డీ-మార్ట్‌కు నిత్యం అనేక మంది వెళుతుంటారు. వీరందరూ ప్రతీ రోజూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు పోలీసులను కలిసి సర్వీసు రోడ్డును మూసివేస్తూ అడ్డంగా ఉంచిన స్టాపర్స్‌ను తీసివేయాలని విన్నవించారు. అయితే, దీని వెనుక పెద్ద వాళ్లు ఉన్నారంటూ సమాధానం రావడంతో ఆశ్చర్యపోవడం వీరి వంతయింది. సర్వీసు రోడ్డు మూసివేతలో ఏకంగా పెద్ద వాళ్ల హస్తం ఎందుకుందో అర్థం కాక తికమకకు గురయ్యారు. అంతేకాకుండా అసలు పెద్దలు ఎవరనే విషయం కూడా తెలియజేసేందుకు పోలీసులు జంకినట్టు సమాచారం. గత మూడు వారాల నుంచి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం స్థానికంగా ఉండే నేతలు కొందరు సర్వీసు రోడ్డుకు అడ్డంగా ఉంచిన స్టాపర్స్‌ను తొలగించారు. దీంతో సదరు పెద్ద తలకాయకు చిర్రెత్తుకొచ్చినట్టు తెలుస్తోంది. ఇదే విషయంపై సదరు స్థానిక నేతలపై ఆయన మండిపడినట్టు సమాచారం. ఈ వ్యవహారాన్ని మరింతగా లాగితే తన ఎన్నికల ఫండ్ విషయం బయటకు వస్తుందని మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది. మొత్తంగా వ్యాపారస్తులపై వేధింపులు కాస్తా కూటమి నేతలు షురూ చేశారన్న అభిప్రాయం మాత్రం నగర ప్రజల్లో వ్యక్తమవుతోంది.



జలమయమైన పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి

ఊపిరి పీల్చుకున్న విశాఖ

- దిశ మార్చుకున్న వాయుగుండం
- జిల్లాలో ఒకట్రెండు చోట్ల చెదురుమదురు వానలు పడే సూచనలు

సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో నెమ్మదిగా కదులుతూ విశాఖ తీరానికి 90 కిలోమీటర్ల సమీపానికి వాయుగుండం వచ్చేసింది. విశాఖలో భారీ వర్షాలు ఉంటాయని అంతా ఆందోళన వ్యక్తం చేశారు. కానీ దగ్గరకు వచ్చినట్లే వచ్చి.. వాయుగుండం దిశ మార్చుకుంది. దీంతో విశాఖ ఊపిరి పీల్చుకుంది. విశాఖమీదుగా కళింగపట్నం వైపు వెళ్లాల్సిన వాయుగుండం రాత్రి సమయంలో కోనసీమ, యానాం వైపుగా పయనించింది. దీంతో శనివారం రాత్రి నాటికి వర్షాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. దీంతో విశాఖ జిల్లాలో వర్షాలు దాదాపు తగ్గుముఖం పట్టినట్లేనని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకూ జిల్లాలో అక్కడక్కడా తేలిక పాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని తెలిపారు. మధ్యాహ్నం నాటికి వాతావరణం పూర్తిగా మారే అవకాశం ఉంది. శనివారం ఉదయం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. పలుమార్లు తెరిపినిస్తూ.. మళ్లీ కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. నగరంలో శనివారం గరిష్ఠంగా సగటున సుమారు 40 మి.మీ వర్షపాతం నమోదైంది. పాతనగరంలోని లోతట్టు ప్రాంతాలైన వెలంపేట, ఫిషింగ్‌హార్బర్, పాతపోస్టాఫీస్, పూర్ణామార్కెట్, లక్ష్మీటాకీస్, జగదాంబ ప్రాంతాలతో పాటు జ్ఞానాపురం, రైల్వే న్యూకాలనీలు జలమయమయ్యాయి. రాకపోకలు స్తంభించాయి. బీచ్ రోడ్డు నిర్మానుష్యంగా మారింది. గంటకు 55 నుంచి 65 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తుండటంతో.. సముద్రం అల్లకల్లోలంగా కనిపించింది. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమైపోయారు. మరో రెండు రోజుల పాటు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దంటూ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు హెచ్చరించారు.



వెలంపేట రోడ్డు జలమయం

ప్రాంతం	వర్షపాతం (మిమీ)		
పెందుర్తి	53.0	అగనంపూడి	29.25
సుజాతనగర్	52.25	భీమిలి	27.5
గోపాలపట్నం	48.75	ఆరిలోవ	26.75
వేపగుంట	47.75	కణితి	26.5
పెదగంట్యాడ	35.75	బుచ్చిరాజుపాలెం	25.5
		గంభీరం	24.0
		సీతమ్మధార	21.0

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం

మహారాణిపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, తక్షణ చర్యలు చేపట్టే విధంగా అందరూ సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్, జీవీఎంసీ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో శనివా రం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 0891-2590100, 0891-2590102కు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చని సూచించారు. కలెక్టర్ తెలిపారు. ఆర్అండ్‌బీ, విద్యుత్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్ట్‌ల్లో సేవలందిస్తారని చెప్పారు.

రాత్రి పూట నిఘా పటిష్టం

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగరంలో నేరాలు తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘాను మరింత పటిష్టం చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో శనివారం ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచి మోటార్ వెహికల్ యాక్ట్ కఠినంగా అమలు చేయనున్న నేపథ్యంలో ఆర్టీవో అధికారులతో సమావేశమై కేసుల నమోదుపై అవగాహన కల్పించారు. అనధికారిక డిపాజిట్లను సేకరించే వారిపై, అనధికారిక చీటీలు/ఫండ్స్ నిర్వహించే వారిపై ఏ విధంగా చర్యలు తీసుకుని బాధితులకు మేలు చేయాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ద్వారా వివరించారు. ఎన్‌డీపీఎస్ కేసుల విషయంలో నిందితులకు కఠిన శిక్షలు పడేలా ఎలా నమోదు చేయాలో సూచించారు. నగరంలో యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్లు, వారిపై పెడుతున్న నిఘా చర్యలపై ఆరా తీశారు. సీజ్డ్ వెహికల్స్ భద్రపరిచేందుకు డంపింగ్ యార్డు ఏర్పాటుపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరిస్తున్న తీరు, విచారణ చేసి పరిష్కరిస్తున్న విధానాలపై పలు సూచనలు చేశారు. సైబర్ క్రైం వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు. కొత్త సాఫ్ట్‌వేర్‌లు వినియోగించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-2 తుహిన్ సిన్హా, డీసీపీ(క్రైం) కె.లతా మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కాదు.. ఒకే చోట!

- అందరినీ ఒక చోటకు పిలిచి పింఛన్ అందిస్తున్న సిబ్బంది
- ప్రభుత్వం చెబుతున్న దానికి పొంతనే లేదు
- ఇబ్బంది పడుతున్న వృద్ధులు, దివ్యాంగులు



పెదజాలారిపేటలో పింఛన్ కోసం సచివాలయం వద్ద వర్షంలో వృద్ధులు, దివ్యాంగుల పడిగాపులు



జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది సచివాలయంలోనే పింఛన్ పంపిణీ చేస్తున్న వార్డు కార్యదర్శి

ఆరిలోవ/మధురవాడ : ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలకు పింఛన్లు అందించే రోజులు పోయాయి. ప్రభుత్వం మారగానే పింఛన్ల పంపిణీ ప్రక్రియలో కూడా మార్పు వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు తెల్లవారే సరికే పింఛన్లు అందజేసేవారు. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో సచివాలయం సిబ్బంది అందరినీ ఒక చోటకు రమ్మని పిలుస్తూ.. పంపిణీ చేస్తున్నారు. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగులు నానా పాట్లు పడుతున్నారు. శ్రీకృష్ణాపురం, ఆరిలోవ, రవీంద్ర నగర్, పెదగదిలి, విశాలాక్షినగర్, ఎంవీపీకాలనీ, మద్దిలపాలెం, ఇసుకతోట, వెంకోజీపాలెం, అడవివరం తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించింది. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది సచివాలయానికి పింఛన్‌దారులను రప్పించి.. అక్కడి కార్యదర్శి పంపిణీ చేశారు. జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్‌లో ఫించన్ దారులను రోడ్డు మీదకి పిలిపించి కార్పొరేటర్ హేమలత ఫించన్ అందించారు. ప్రభుత్వం ఇంటింటికీ పింఛన్ అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుంటే.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. కాగా.. ఆరిలోవకాలనీలోని సచివాలయం-6 పరిధిలో రూ.2 వేలు తేడా వచ్చింది. సిబ్బంది ఎవరికో రూ.2వేలు ఎక్కువగా ఇచ్చేశారు. దీంతో లెక్కల్లో తేడా వచ్చింది. తిరిగి సిబ్బంది ఆ ప్రాంతానికి వచ్చి.. ఎవరికో డబ్బులు ఎక్కువ ఇచ్చేశాం.. తిరిగి ఇచ్చేయండి అంటూ కోరారు.

94.54 శాతం పింఛన్ల పంపిణీ

మహారాణిపేట: ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను శనివారం 94.54 శాతం మందికి అందించారు. జిల్లాలో మొత్తం 1,62,941 మంది లబ్ధిదారులు ఉండగా.. ప్రభుత్వం రూ.69,99,96,000 నిధులు విడుదల చేసింది. శనివారం సాయంత్రం 7 గంటల సమయానికి సచివాలయం సిబ్బంది 1,54,044 మందికి రూ.66,18,55,000 అందజేశారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తెలిపారు.



శ్రీకృష్ణాపురంలో లబ్ధిదారులను ఓ చోటకు చేర్చి పింఛన్లు అందజేస్తున్న సచివాలయం సిబ్బంది

రోజూ 5 వేల వీధి దీపాలు వెలగడం లేదు

- వంద రోజుల ప్రణాళికను పక్కగా అమలు చేస్తాం
- శివారు ప్రాంతాలకు మంచి నీటి సరఫరాకు ప్రణాళికలు
- టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందిపై ఫిర్యాదులొస్తున్నాయి
- మీడియా సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీలో ప్రతి రోజూ 5 వేల వరకూ వీధి దీపాలు వెలగకపోవడంపై నిరంతరం ఫిర్యాదులొస్తున్నాయనీ.. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ స్పష్టం చేశారు. జీవీఎంసీ అభివృద్ధికి నిర్దేశించుకున్న 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఏ ఏ చర్యలు తీసుకుంటున్నామనే అంశాలను కమిషనర్ శనివారం మీడియాకు వివరించారు.

1200 స్ట్రీట్‌లైట్స్ ప్రతి రోజూ పగులుతున్నాయి

ప్రతి రోజూ వీధిదీపాల సమస్యపై వస్తున్న ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయి పరిశీలనలో అనేక విషయాలు తెలిశాయి. వీధిదీపాల నిర్వహణ విషయంలో ఏజెన్సీ విఫలమవుతోందని గుర్తించాం. మెయింటెనెన్స్‌కు 700 నుంచి 800 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించాం. సాధారణ సమస్యలకు ఆకతాయిల ఆగడాలు తోడవుతున్నాయి. ప్రతి రోజూ 1100 నుంచి 1200 స్ట్రీట్ లైట్స్ పగిలిపోతున్నాయన్న ఫిర్యాదులపై రాత్రి సమయంలో పరిశీలిస్తే.. ఆకతాయిలు చేస్తున్న దుశ్చర్యలుగా గుర్తించాం. గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలు సాగించేందుకు డార్క్ స్పాట్స్ ఏర్పాటు చేసేందుకు 89 ప్రాంతాల్లో ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. పోలీస్ కమిషనర్‌తో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో రాత్రి గస్తీ చేపడుతున్నాం.

డ్రైనేజీల్లో మంచినీటి పైప్‌లైన్లు

తాగునీటి కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించాం. దశాబ్దాల క్రితం వేసిన 390 పైప్ లైన్లు డ్రైనేజీల మీదుగా క్రాస్ అవుతున్నట్లు గుర్తించాం. వీటిలో 345 పైప్‌లైన్లను సరిచేశాం. మిగిలిన వాటి పనులు త్వరలోనే పూర్తవుతాయి. జీవీఎంసీకి చెందిన పంప్ హౌస్‌ల వద్ద ప్రత్యేకించి ఏర్పాటుచేసిన ల్యాబ్‌ల్లో రోజుకు 2,500 నీటి నాణ్యత తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఏపీపీసీబీ అధికారులు ప్రతి 3 నెలలకోసారి స్థానిక ఎస్‌హెచ్‌జీ మెంబర్ సమక్షంలో నీటి నాణ్యత పరీక్షలు చేస్తున్నారు. నీటి సరఫరాలో గ్యాప్ అనాలసిస్‌ని గుర్తించి, ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ విషయమై సర్వే చేసి 22 వేల ఇళ్లను గుర్తించడం జరిగింది. వాటికి కావలసిన మౌలిక సదుపాయాలు అమృత్, ఇతర పథకాల ద్వారా అందించనున్నాం. శివారు ప్రాంతాలకు సమర్థవంతంగా తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

టౌన్‌ప్లానింగ్‌పై ఎక్కువ ఫిర్యాదులు

టౌన్‌ప్లానింగ్ విభాగంపైనే గ్రీవెన్స్‌లో 80 శాతానికి పైగా ఫిర్యాదులొస్తున్నాయి. ప్రతి రోజూ 5,700కి పైగా ప్లాన్ కోసం దరఖాస్తులు వస్తున్నాయి. వీటిలో ఎక్కువ దరఖాస్తులు షార్ట్‌ఫాల్ లిస్ట్‌లో చేరుతున్నాయి. అసలు ఎక్కడ లోపాలున్నాయనే దానిపై సమీక్ష నిర్వహిస్తున్నాం. మరోవైపు ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించేందుకు కేంద్రీకృత బృందం ఏర్పాటు చేశాం. ప్లాన్ లేకుండా జరుగుతున్న అక్రమ కట్టడాలపై చర్యలకు జోనల్ స్థాయి బృందాలు ఏర్పాటు చేస్తున్నాం. 100 రోజుల్లో టౌన్‌ప్లానింగ్ ప్రక్షాళన జరుగుతుందని ఆశిస్తున్నాను.

శిథిలమైన భవనాలపై చర్యలు

తుఫాన్లు, భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నాం. కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ.. వారికి పునరావాస కేంద్రాలను జోన్ల వారీగా ఏర్పాటు చేస్తున్నాం. నగర పరిధిలో 1,628 శిథిలమైన భవనాలను గుర్తించాం. పునరావాస కేంద్రాల గుర్తింపు ప్రక్రియకు యూసీడీతో సమన్వయం చేస్తున్నాం. భవన ప్రణాళికలు, పెండింగ్ ఫైల్స్, ప్రజల సమస్యలపై అభిప్రాయాల కోసం లైసెన్స్ టెక్నికల్ పర్సన్, బిల్డర్స్ అసోసియేషన్‌తో సమావేశాలు నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

నేటి నుంచి హెల్మెట్ తప్పనిసరి

- వెనుక కూర్చున్న వారికి కూడా..
- ఇద్దరిలో ఎవరికి లేకపోయినా రూ.1,035 జరిమానా
- అలాగే 3 నెలలు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్

విశాఖ సిటీ: హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారి జేబులు చిల్లులుపడనున్నాయి. బైక్ నడిపే వారే కాదు.. వారి వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించకపోయినా బాదుడు తప్పదు. ఆదివారం నుంచి హెల్మెట్ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని పోలీస్ అధికారులు నిర్ణయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు నేటి నుంచి నగరంలో ప్రత్యేక తనిఖీల డ్రైవ్ నిర్వహించనున్నారు. బైక్ నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ ధరించాల్సిందే. లేనిపక్షంలో భారీగా జరిమానా చెల్లించాల్సి వస్తుంది.

నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్న నిబంధన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ.. అనేక మంది వాహనదారులు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఇప్పటికీ చాలా మంది హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూనే ఉన్నారు. అప్పుడప్పుడు పోలీసులు ఆకస్మిక డ్రైవ్‌లు నిర్వహించి చలానాలు వేస్తున్నప్పటికీ.. చాలా మందిలో ఎటువంటి మార్పు లేదు. ఒక్కో వాహనంపై పదుల సంఖ్యలో ఈ-చలానాలు ఉన్నట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించారు. వాటి వసూళ్లపై అప్పుడప్పుడు దృష్టి సారించి తనిఖీల్లో బలవంతంగా ఆ చలానాలు కట్టిస్తున్నప్పటికీ.. అనేక మంది ఇంకా నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్నారు.

వెనుక ఉన్న వారికి హెల్మెట్ ఉండాల్సిందే..

ఇప్పటి వరకు బైక్ నడిపే వారు మాత్రమే హెల్మెట్ ధరించాలన్న నిబంధన పోలీసులు అమలు చేస్తున్నారు. ఆదివారం నుంచి బైక్ వెనుక కూర్చున్న వారు సైతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సి ఉంటుంది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు బైక్ మీద వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్న నిబంధనను కచ్చితంగా అమలు చేయడానికి పోలీసులు సిద్ధమయ్యారు. అదీ కూడా కేవలం బీఐఎస్ మార్క్ ఉన్న హెల్మెట్లు మాత్రమే వినియోగించాలని సూచిస్తున్నారు. ఇద్దరిలో ఎవరికి హెల్మెట్ లేకపోయినా రూ.1035 చలానా విధించనున్నారు. అలాగే హెల్మెట్ లేకుండా బైక్ నడిపే వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను యూ/ఎస్ 194(డీ) ఎంవీ యాక్ట్ ప్రకారం 3 నెలల పాటు సస్పెండ్ చేయనున్నారు. హెల్మెట్ ధారణపైనే కాకుండా వాటిని విక్రయించే వారిపై కూడా పోలీసులు దృష్టి పెడుతున్నారు. బీఐఎస్ మార్కు స్టాండర్డ్స్ లేని హెల్మెట్లను విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

కూటికుప్పలకు గ్లోబల్ హెల్త్ ఎక్స్‌లెన్సీ అవార్డు

కంచరపాలెం: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు 'గ్లోబల్ హెల్త్ ఎక్సలెన్సీ అవార్డ్-2024'స్వీకరించారు. న్యూఢిల్లీలో శుక్ర, శనివారాల్లో కేంద్ర ఆయుష్ శాఖ, గవర్నమెంట్ ఆఫ్ ఎన్‌సీటీ ఆఫ్ ఢిల్లీ, ఎంఎస్‌ఎంఈ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 7వ అంతర్జాతీయ హెల్త్ అండ్ వెల్‌నెస్ సదస్సు జరిగింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్య రంగంలో డాక్టర్ కూటికుప్పల సూర్యారావు కృషిని గుర్తిస్తూ.. కేంద్ర మంత్రి జాదవ్ ప్రతాప్‌రావ్ గణపాత్రో చేతుల మీదుగా ఈ అవార్డును అందించారు.



అవార్డును అందుకుంటున్న కూటికుప్పల

ప్రతి కార్డుదారుడికి అర కిలో పంచదార

మహారాణిపేట: ప్రతి కార్డుదారుడికి ఈనెల అర కిలో పంచదార సరఫరా చేయనున్నట్లు జిల్లా డీఎస్‌వో సూర్యప్రకాశరావు తెలిపారు. రానున్న రెండురోజుల్లో రేషన్ డీలర్లు అంతా పంచదార తీసుకుని రేషన్ కార్డుదారులకు ఇవ్వాలని సూచించారు.

అనుమానమే పెనుభూతమై!

భార్య గొంతు నులిమి హత్య చేసిన భర్త?

మద్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత హత్య కలకలం రేపింది. శుక్రవారం రాత్రి భార్యాభర్తలు గొడవపడ్డారు. ఉదయం అయ్యే సరికి ఆమె విగతజీవిగా పడి ఉంది. దీంతో ఆమె భర్త 'మీ కుమార్తె ఉదయం నుంచి నిద్రలేవడం లేదు' అని ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వారు వెంటనే అక్కడకు చేరుకుని తమ కుమార్తెను కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు ఇది సాధారణ మృతి కాదని, ఎవరో గొంతు నులిమి చంపేశారని చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందగా.. ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. అనుమానంతో అతను భార్య గొంతు నులిమి హత్య చేసినట్లు సమాచారం. వివరాలివీ.. తుమ్మడిపాలెంలో ధనేశ్వరరావు, అతని భార్య రాధిక (23), పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరికి 2018లో వివాహం జరిగింది. ధనేశ్వరరావు వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రాధిక దొండపర్తి వద్ద ఓ బ్యూటీపార్లర్‌లో పని చేస్తోంది. శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి రాధికను ద్విచక్ర వాహనంపై తీసుకురావడాన్ని గమనించిన ధనేశ్వరరావు వారితో గొడవపడ్డాడు. అయితే ఆమె ఇంటికి వెళ్దాం.. రోడ్డు మీద గొడవ ఎందుకని నచ్చజెప్పడంతో ఇంటికి చేరుకున్నారు. తర్వాత మళ్లీ భార్యతో గొడవ జరిగింది. ఈ క్రమంలో శనివారం ఉదయం తన భార్య నిద్రలేవడం లేదని ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. హుటాహుటిన వచ్చిన వారు రాధికను కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అయితే ఆమె మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించి.. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఆమెను ఎవరో గొంతు నలిమి చంపినట్టు వైద్యులు కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. పోలీసులు ధనేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. రాధిక తల్లి సింగపల్లి శాంతి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

